సాక్షి
పల్నాడు

మంగళవారం । 4 । జూలై । 2023



కలెక్టరేట్‌లో గురుపౌర్ణమి
నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం వ్యాసమహర్షి జయంతి (గురుపౌర్ణమి) నంద ర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ శివశం కర్, జేసీ శ్యామ్‌ప్రసాద్ పూలమాలలు వేశారు.



బగళాముఖి సేవలో..
పిట్టలవానిపాలెం: చందోలు శ్రీ బగళాముఖి ఆలయానికి ఏపీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ పద్మావతి పద్మవీర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ప్రత్యేక పూజలు చేశారు.



తిరుపతమ్మకు విరాళం
పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలోని అంకమ్మ ఉపాలయం వెండి తాపడం తయారీకి సోమవారం జయంత్ సాయి రూ.1,00,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్


5 నుంచి గురుకుల జూనియర్ కళాశాలల్లో 3వ విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 3వ విడతలో ప్రవేశాలను ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ఈనెల 5,6,7 తేదీల్లో ఆంధ్ర, 6న రాయలసీమ ప్రాంతాల్లో వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి, కళాశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు. తాటిపూడి, నిమ్మకూరు, నాగార్జునసాగర్, గుంటూరు (మైనార్టీ) వెంకటగిరి కళాశాలల్లో ఎంపీసీ, ఈఈటీ గ్రూపులకు ఈనెల 5న, బైపీసీ, సీజీటీ గ్రూపులకు ఈనెల 6న, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కర్నూలులోని మైనార్టీ బాలురు, గ్యారంపల్లి, కొడిగెనహళ్లిలోని మైనార్టీ బాలికల కళాశాలలతోపాటు వాయల్పాడులోని బనవాసి మైనార్టీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 6న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

8,9 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల సమీపంలోని కేఎస్‌ఆర్ కాన్వోనియం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 7వ తేదీలోపు తమ ఎంట్రీలను పంపించాలని పేర్కొన్నారు. వివరాలకు 93482 30112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.60 అడుగుల వద్ద ఉంది. ఇది 148.5482 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,459, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్‌ఫ్లో 8,359 క్యూసెక్కులు. శ్రీశైలం జలాశయం నుంచి 8,359 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.50 అడుగుల వద్ద ఉంది. ఇది 33.4364 టీఎంసీలకు సమానం.

నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్-3 పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్-2 హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 38 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతుల కోసం 31-3-2006కు ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్ ఉపాధ్యాయులతోపాటు 10-2-2009కి ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్ ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ ఉపాధ్యాయులు తమ సేవా పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లతో గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని వివరించారు.

నేడు జెడ్పీ హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో పొందుపర్చినట్లు డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలోని స్కూల్ అసిస్టెంట్లు విద్యార్హతల సర్టిఫికెట్లు, సేవా పుస్తకంతో మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో హాజరు కావాలని సూచించారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు,హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కల నెరవేరే వేళ

- జాతీయ రహదారిగా కొండమోడు–పేరేచర్ల రోడ్డు
- విస్తరణకు చురుగ్గా అడుగులు
- నాలుగు మండలాల్లో 464.28 ఎకరాల భూ సేకరణ
- మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్ల నిర్మాణం
- నేడు, రేపు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఆరు గ్రామాల రైతులతో సమావేశం
- హాజరు కానున్న పల్నాడు జేసీ శ్యామ్ ప్రసాద్



పేరేచర్ల–కొండమోడు ప్రధాన రహదారి

సత్తెనపల్లి:గుంటూరు–హైదరాబాద్ ప్రధాన మార్గంలోని గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు ఉన్న రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రద్దీకి తగినట్టు ఈ మార్గం విస్తరణ జరగకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోయే దుస్థితి వచ్చింది. ఫలితంగా ఈ దారిని విస్తరించాలని ఏన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉన్నా.. గత పాలకులు పట్టించుకోలేదు. రహదారి విస్తరణ జరిగిపోతుందని కాగితాల్లో చూపించారే తప్ప వాస్తవ రూపం దాల్చలేదు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని నేషనల్ హైవే జాబితాలో చేర్పించారు. అనేకమార్లు కేంద్రమంత్రులను కలిసి రహదారి ప్రాధాన్యాన్ని వివరించి నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కృషి చేశారు. ఫలితంగా ప్రస్తుతం రహదారి విస్తరణకు చురుగ్గా అడుగులు పడుతున్నాయి. దీంతోపాటు మేడికొండూరు, సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్లు నిర్మించేందుకూ అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది.

విస్తరణ ఇలా..

తాడికొండ నియోజకవర్గంలోని మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం కొండమోడు వరకు 49.91 కిలోమీటర్ల ప్రధాన రహదారి ఇది. దీనిని నాలుగు వరుసలుగా 45 మీటర్ల వెడల్పున విస్తరించేందుకు 464.28 ఎకరాలు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మేడికొండూరు మండలంలో 87.55 ఎకరాలు, సత్తెనపల్లి మండలంలో 175.25 ఎకరాలు, ముప్పాళ్ళ మండలంలో 64.96 ఎకరాలు, రాజుపాలెం మండలంలో 136.52 ఎకరాలు భూసేకరణలో ఉంది. ఇదికాక పిడుగురాళ్ళ, బెల్లంకొండ మండలాల్లో కొంత భూమి సేకరించాలి. భూసేకరణ కోసం మూడు బృందాలు సర్వే పనులు ముమ్మరంగా చేపట్టాయి. ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించడంతోపాటు పలు సర్వే నంబర్లలో రైతుల వివరాలను నమోదు చేశాయి.

రైతులతో సమావేశాలు

పేరేచర్ల–కొండమోడు రహదారి విస్తరణకు సంబంధించి భూములు కోల్పోతున్న 12 గ్రామాలకు చెందిన 572 మంది రైతులతో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సమావేశాలు నిర్వహించి పరిహారం విషయమై చర్చిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే గత నెల 27న పిడుగురాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో పిడుగురాళ్ల మండలానికి సంబంధించి 28 మంది రైతులతో, బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో బెల్లంకొండ మండలానికి సంబంధించిన 20 మంది రైతులతో, గత నెల 30న రాజుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో రాజుపాలెం మండలం కుబాద్‌పురానికి చెందిన 66 మంది, చౌటపాపాయ పాలెంకు చెందిన 29 మంది, రాజుపాలెంకు చెందిన 38 మంది, రెడ్డిగూడెంకు చెందిన 81 మంది రైతులతో సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లకు చెందిన 91 మంది, కంకణాలపల్లికి చెందిన 21 మంది, సత్తెనపల్లికి చెందిన ఒకరు, ఈ నెల 5న వడ్డవల్లికి చెందిన 77 మంది, నందిగామకు చెందిన 65 మంది, కంటెపూడికి చెందిన 55 మంది రైతులతో సమావేశం కానున్నారు.

మూడు బైపాస్‌లు ఇలా..

పేరేచర్ల–కొండమోడు ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరించనున్న నేపథ్యంలో మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.


- మేడికొండూరు మండలంలో గుంటూరు–నర సరావుపేట మార్గంలోని డోకిపర్రు నుంచి మేడికొండూరులోని దర్గా వరకు 5.5 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
- సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలోని బచ్చగుంట నుంచి ధూళ్ళిపాళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని గిడ్డంగుల వరకు 11.2 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు రానుంది.
- రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలోని ఆర్వోబీ నుంచి కొండమోడుమీదుగా పిడుగురాళ్ళ బైపాస్ రోడ్డును కలుపుతూ 2.9 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మితం కానుంది.

ప్రైవేటు రాబడులు

గుంటూరు అరండల్‌పేటకు చెందిన సుధాకర్ ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగి. తన ఇద్దరు పిల్లలను దగ్గర్లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. ఒకటో తరగతిలో చేర్పించిన బాబుకు రూ.15వేల ఫీజుతో పాటు పుస్తకాల కోసం అదనంగా రూ.మూడు వేలు చెల్లించాలని స్కూల్లో చెప్పారు. రెండో తరగతిలో చేర్పించిన అమ్మాయికి ఫీజు రూపంలో రూ.18వేలతోపాటు పుస్తకాల కోసం రూ.3,500 చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల వెల రూ.400 లోపే ఉంది కదా అని సుధాకర్ అడిగితే ప్రభుత్వ పుస్తకాలతో తమకు సంబంధం లేదని, స్కూల్లో తామిచ్చే పుస్తకాలనే కొనాలని కరాఖండీగా చెప్పారు.

– ఇదీ ఇప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రైవేటు పాఠశాలల వసూళ్ల దందా..

- ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ముందుకు రాని యాజమాన్యాలు
- ఒకటి నుంచి టెన్త్ వరకు సర్కారువే కొనాలని ఆదేశించినా బేఖాతర్
- బడులు తెరిచేనాటికే పుస్తకాలు సిద్ధం చేసిన పాఠ్యపుస్తక విభాగం
- గుంటూరు జిల్లాలోని 637 ప్రైవేటు స్కూళ్లలో 317 విద్యాసంస్థల నుంచే ఆర్డర్లు
- ప్రైవేటు పబ్లిషర్ల నుంచి పుస్తకాలు కొంటూ రూ.లక్షలు ఆర్జిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పబ్లిషర్లు ముద్రించిన పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యాంశాల బోధనకు బదులుగా అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులను నిర్వహిస్తున్నాయి. గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ ద్వారా రూపొందించి, ముద్రించిన పాఠ్య పుస్తకాలనే బోధించాలని 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందుగానే జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన విక్రయ పాఠ్య పుస్తకాలనూ ప్రభుత్వం సకాలంలో సిద్ధం చేసింది. అయితే పాఠశాలల యాజమాన్యాలు వాటిని కొనుగోలు చేయట్లేదు. ప్రైవేటు పబ్లిషర్ల నుంచి అధిక ధరలకు పుస్తకాలను కొని తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయి.

60 శాతం పాఠశాలల్లోనే ప్రభుత్వ టెక్స్ట్‌బుక్స్

నాణ్యమైన మెటీరియల్‌తో ముద్రిస్తున్న పాఠ్య పుస్తకాలను నామమాత్రపు ధరకే ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన దుకాణాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,200 వరకు ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో మూడు లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, వారికి అవసరమైన 14.68 లక్షల మేర పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వ అనుమతి పొందిన విక్రయదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి పాఠ్య పుస్తక విభాగం ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చిన ఆర్డర్‌కు అనుగుణంగా పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. అయితే 60 శాతం ప్రైవేటు స్కూళ్లు మాత్రమే ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కొని బోధన చేస్తున్నాయి.

అధికారులు స్పష్టం చేసినా..

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి, కొనేలా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం దీనిపై విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారాన్ని చేరవేసింది. ఇటీవల డివిజన్‌స్థాయిలో యాజమాన్యాలతో సమావేశమైన అధికారులు విధివిధానాలను స్పష్టం చేశారు. అయినా ఒక్క గుంటూరు జిల్లాలో 637 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉండగా, వాటిలో 317 పాఠశాలలే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టాయి.

కచ్చితంగా తీసుకోవాలి

ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్య పుస్తకాలను కచ్చితంగా కొనాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– పి.శైలజ, డీఈవో, గుంటూరు

అర్హులకు సంక్షేమ పథకాలను అడ్డుకుంటే చర్యలు

వృద్ధుడికి పింఛన్ మంజూరు చేయని వెల్ఫేర్ సెక్రటరీ సస్పెన్షన్

నరసరావుపేట: వ్యక్తిగత కారణాలతో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాకుండా అడ్డుకునే సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. పెద్దిరెడ్డిపాలెం గ్రామ సచివాలయ వెల్ఫేర్–ఎడ్యుకేషన్ సెక్రటరీ పాముల మంజులత విధుల్లో అలసత్వం వహించడంతో సస్పెండ్ చేయాలని సాంఘిక సంక్షేమ అధికారి ఓబుల నాయుడును కలెక్టర్ ఆదేశించారు.

అసలేం జరిగిందంటే..

మండలంలోని కేతముక్కల అగ్రహారం గ్రామానికి చెందిన బోయపాటి జయంతి బాబు వృద్ధాప్య పింఛన్ కోసం అర్జీ పెట్టుకున్నాడు. పలుమార్లు వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మంజులతను కలిసి విన్నవించాడు. వారు పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీతో మాట్లాడారు. స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుని వృద్ధునికి వృద్ధాప్య పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా స్థానిక సమస్యల వల్ల వెల్ఫేర్ సెక్రటరీ మంజులత వృద్ధుడికి పెన్షన్ మంజూరు చేయలేదు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ మంజులతను విధుల నుంచి సస్పెండ్ చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని ఆదేశించారు.

41,548 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 41,548 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,692 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి రూ. 25,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది.

• ముత్యాల పందిరిలో విహరించె



నిండుపున్నమి వేళ.. ముత్యాల పందిరిలో.. దేవేరులతో కలిసి సర్వాంగ సుందరంగా ముస్తాబైన మంగళగిరి నృసింహుడు వెన్నెల వాకిళ్లలో విహరించాడు. భక్తజనులను దివ్య మంగళ స్వరూపంతో కటాక్షించాడు. ఫలితంగా భక్తిపారవశ్యం ఉప్పొంగింది. ఆధ్యాత్మికోత్సాహం పరవళ్లు తొక్కింది. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ముత్యాల పందిరి ఊరేగింపు వైభవంగా జరిగింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు ఊరేగింపు సేవలో పాల్గొన్నారు. – మంగళగిరి

జన మేలు కోసమే 'జగనన్నకు చెబుదాం'

'స్పందన'లో 357 అర్జీలు స్వీకరించిన కలెక్టర్

నరసరావుపేట: ప్రజలకు మేలు చేయడం కోసమే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ప్రతివారం నిర్వహిస్తోందని కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. భారీగా తరలివచ్చిన ప్రజల నుంచి 357 అర్జీలను కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కె.వినాయకం స్వీకరించారు. అనంతరం ఆ ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలకు రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెం గ్రామవాసి జిజ్రా కోటిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత అన్నదానం చేసిన ఆయన కుమారుడు జిజ్రా సాంబశివారెడ్డిని కలెక్టర్ సత్కరించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

డంపింగ్ యార్డును తరలించండి

గుంటూరు రోడ్డులో టిడ్కో గృహాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలి. అందులోని చెత్తకు నిప్పు అంటుకోవటం వల్ల పట్టణంలోకి దుర్వాసన వస్తుంది. పారిశుద్ధ్య కార్మికులూ లోపలికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కాసా రాంబాబు, వైదన వెంకట్, సీపీఐ నాయకులు

రియల్టర్లపై చర్యలు తీసుకోండి

రావిపాడు గ్రామం మీదుగా ప్రవహించే గోవిందపురం ఎస్ఎస్పీ మైనర్ కాలువకు ఉపకాలువగా ఉన్న బోదెను పూడ్చి రియల్టర్లు వెంచర్లు వేసి ప్రజలను మోసం చేస్తున్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని కాలువను పునరుద్ధరించాలి.

– తాడపినేని లూర్దుమేరీ, రావిపాడు

భో'జన బంధు'.. అనితరసేద్యం

పోలీస్ శ'భాసూ'

- పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సహృదయం
- పోలీసు సిబ్బందికి రూ.40కే నాణ్యమైన ఆహారం
- సబ్సిడీ ధరలతో క్యాంటీన్ నిర్వహణ
- కార్యాలయ ప్రాంగణంలోనే సేంద్రియ సాగు
- ప్రతి సోమవారం 'స్పందన'కు వచ్చే ప్రజలకూ ఉచితంగా భోజనం



పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో భోజనం చేస్తున్న పోలీస్ సిబ్బంది

ఆయన వృత్తిరీత్యా కఠినంగా ఉండే పోలీస్ బాస్. అన్నం పెట్టే రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ ఖాకీ మనసుకు ఆకలి బాధ తెలుసు. అందుకే విధుల్లో తీరిక లేని సిబ్బంది భోజన కష్టాలను గుర్తించారు. సహృదయంతో ఆలోచించి సబ్సిడీపై క్యాంటీన్ ప్రారంభించారు. రూ.40కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. పదార్థాల తయారీ కోసం తన కార్యాలయ ప్రాంగణంలోనే సేంద్రియ సేద్యం ద్వారా పంట ఉత్పత్తులు పండిస్తున్నారు. భళా బాసు.. శ'భాసు' అనిపించుకుంటున్నారు.

సాక్షి, నరసరావుపేట: సరిగ్గా ఎనిమిది నెలల క్రితం.. అది నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయం. మధ్యాహ్నం 2 గంటల సమయం. ఆకాశాన సూరీడు నిప్పులు చెరుగుతున్నాడు. కార్యాలయం నుంచి బయటకు వెళుతున్న పది మంది కానిస్టేబుళ్లు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి కంట్లో పడ్డారు. వారి కళ్లల్లో అలసట, ఆకలి వేదన స్పష్టంగా కనిపిస్తున్నాయి. మెలిపెడుతున్న పేగుల వ్యథను ఇట్టే అర్థం చేసుకున్న ఆయన త్వరగా భోజనం చేసి రండని చెప్పి పంపారు.. అంతటితో ఆ విషయాన్ని ఆయన వదిలేయలేదు. రోజూ తన సిబ్బంది భోజనానికి పడుతున్న ఇబ్బందులపై దృష్టిపెట్టారు. మదిలో మెదిలిన మెరుపులాంటి ఆలోచనను ఆచరణలో పెట్టారు. సిబ్బందిపాలిట భోజన బాంధవుడై నిలిచారు. ఎస్పీ కార్యాలయంలో గుంటూరు, ఇతర ప్రాంతాల నుంచి వస్తూ సుమారు 70 నుంచి వంద మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు కార్యాలయం నుంచి భోజనానికి హోటల్‌కు వెళ్లాలంటే రెండు, మూడు కిలోమీటర్లు దూరం ఉంటుంది. రోజుకు వారి ఆహార ఖర్చు రూ.వందపైనే అయ్యేది. పైగా రోజూ బయట భోజనం తినడం వల్ల వారి ఆరోగ్యమూ తరచూ పాడయ్యేది. దీనిని గమనించిన ఎస్పీ వారి కోసం కార్యాలయంలోనే సబ్సిడీ క్యాంటీన్ నెలకొల్పాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా ఉద్యోగులతో సమన్వయం చేసుకుని ఆచరణలోకి తీసుకొచ్చారు.

వేడివేడి భోజనం.. తక్కువ ధరకు

క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలను ఏఆర్ ఆర్ఐ రవికిరణ్‌కు ఎస్పీ అప్పగించారు. కేవలం రూ.40కే భోజనం అందిచేలా చర్యలు చేపట్టారు. రోజూ క్యాంటీన్‌లో 70 నుంచి 100 మంది వరకు సిబ్బంది భోజనం చేస్తున్నారు. సమావేశాలు, ఇతర సందర్భాల్లో ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. వేడివేడి భోజనం అతితక్కువ ధరకు లభ్యమవుతుండడంతో పోలీసు సిబ్బంది తమ బాస్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.

అర్జీదారులకూ ఉచిత భోజనం

ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమానికి అర్జీలు అందించేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. వీరికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. దీనికోసం దాతలను ప్రోత్సహిస్తున్నారు. ఎస్పీ కార్యాలయంలోకి అడుగు పెట్టగానే ప్రజలు ముందు ఉండే వ్యవసాయ క్షేత్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతున్నారు. పచ్చని వనంలో సేదదీరుతున్నారు.

తక్కువ ధరకే సరుకులు...

ఎస్పీ కార్యాలయంలోని క్యాంటీన్‌లో అన్ని రకాల సరుకులూ పోలీసు సిబ్బందికి మార్కెట్ ధర కన్నా 10 నుంచి 30 శాతం తక్కువకే అందిస్తున్నారు. ఇది తమ కుటుంబాలకు ధరాభారం నుంచి ఉపశమనం కలిగిస్తోందని సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కూరగాయల సేంద్రియ సేద్యాన్ని అప్పటి ఐజీ త్రివిక్రమవర్మకు చూపుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సేంద్రియ సాగుతో ఆరోగ్య సిరి

క్యాంటీన్‌లో వంటకు అవసరమైన కూరగాయల సాగు కోసం ఎస్పీ తన కార్యాలయంలోనే వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి రావడంతో సేద్యంపై ఆయనకు అవగాహన ఉంది. పలురకాల కూరగాయలు, ఆకుకూరలతోపాటు పండ్లనూ సేంద్రియ పద్ధతిలోనే పండిస్తున్నారు. దీంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులతో క్యాంటీన్‌లో ఆహారపదార్థాలు తయారుచేస్తున్నారు.

తోటలోకి వెళితే చెప్పలేని ఆనందం



పోలీసు సిబ్బందికి నాణ్యమైన ఆహారం తక్కువ ధరకే అందించాలన్న ఉద్దేశంతో క్యాంటీన్ ఏర్పాటు చేశాం. వంటకు కావాల్సిన పదార్థాలను సేంద్రియ పద్ధతిలో పండించాలని నిర్ణయించాం. దీని కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాం. రోజూ తోటలోకి వెళ్తా. చిన్నప్పుడు పొలాల్లో తిరిగిన జ్ఞాపకాలు మదిలో మెదులుతాయి. చెప్పలేని ఆనందం ఉప్పొంగుతుంది .

– వై రవిశంకర్ రెడ్డి, ఎస్పీ, పల్నాడు జిల్లా

అధిక దిగుబడులు సాధించిన రైతులకు అభినందన



కలెక్టరేట్‌లో ఆదర్శ రైతులను గౌరవిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

రైతు వందనంలో రైతులను సన్మానించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ఆధునిక సాంకేతిక విధానాలు, సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించిన ఇద్దరు రైతులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రశంసా పత్రాలను అందజేసి సత్కారించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రతివారం నిర్వహించే రైతు వందనంలో భాగంగా ఈ వారం వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలానికి చెందిన ఇద్దరు ఉద్యాన రైతులు మేడం బక్కిరెడ్డి, మేడం శ్రీనివాసరెడ్డిలను సన్మానించారు. పమిడిపాడుకు చెందిన రైతు మేడం బక్కిరెడ్డి ఒక ఎకరం విస్తీర్ణంలో రూ.30వేలు ఖర్చుతో జామ తోట వేశారు. సాధారణ విధానంలో ఆరు టన్నుల వరకు దిగుబడినిచ్చే జామ పంట రైస్డుబెడ్, డ్రిప్ విధానంతో పాటు సేంద్రియ ఎరువులను వాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసి ఏడు టన్నుల దిగుబడి సాధించాడు. పంటపై వచ్చే పండు ఈగను పచ్చి మిరప, వేపాకు, కలబంద, ఉల్లిపాయలతో ద్రావణం చేసి మొక్కలకు స్ప్రే చేయటం ద్వారా ఈగను నివారించాడు. డ్రిప్ ద్వారా పాండుగవ్య, పంచగవ్య అందించటంతో కాయ నాణ్యతతో దిగుబడి పెరిగింది. ఎకరాకు రూ.లక్ష ఆదాయం సమకూరగా పెట్టుబడి పోను ఎకరాకు రూ.70వేలు ఆదాయం లభించింది. అలాగే గరికపాడు గ్రామానికి చెందిన మేడం శ్రీనివాసరెడ్డి తనకున్న ఐదెకరాల పొలంలో తైవాన్ రకం జామ పంట వేసి 35 టన్నుల దిగుబడిని సాధించాడు. దీనికి ఖర్చు రూ.1.5లక్షలు కాగా, ఆదాయం రూ.5లక్షల వరకు వచ్చింది. రూ.3.5లక్షలు మిగిలింది. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాదు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీజే బెన్నీ, డీఆర్వో కె.వినాయకం, డ్రిప్ ఇరిగేషన్‌శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ దోమలు కుట్టకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాదు, వైద్యశాఖ అధికారులతో కలిసి వాల్‌పోస్టర్, బ్యానర్ ఆవిష్కరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ జిల్లాలో జూలై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు డెంగీ నివారణ మాసోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, జిల్లా మలేరియా నివారణ అధికారి కె.రవీంద్ర రత్నాకర్ పాల్గొన్నారు.

రూ.3కోట్లు అప్పు చేసి వెళ్లిపోయాడు..

'గ్రామంలో సుమారు 40 మంది ఒకరికి తెలియకుండా మరొకరిని నమ్మించిన ఓ వ్యక్తి ప్రామిసరీ నోట్లు రాసి రూ.3కోట్లు అప్పు తీసుకున్నాడు. అతడికి 20 ఎకరాల పొలం, ఇల్లు, స్థలం ఉన్నాయి. వాటిని చూసి మేమంతా అప్పుగా డబ్బులు ఇచ్చాం. మా డబ్బులతో పిల్లలను ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ చదివించాడు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. తీరా డబ్బులు తిరిగి చెల్లించమని అడిగితే మాకు చెప్పకుండా కుటుంబంతో సహా ఊరు నుంచి వెళ్లిపోయాడు. మమ్మల్ని మోసం చేసిన అతడిపై చర్యలు తీసుకొని మా డబ్బులు మాకు ఇప్పించండి' అంటూ నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామానికి చెందిన బాదం శివారెడ్డి, రొండా సుబ్బులుతో పాటు మరో 40 మంది ఫిర్యాదు చేశారు.

- స్పందనలలో నరసింగపాడు బాధితులు ఫిర్యాదు
- 48 ఫిర్యాదుల స్వీకరణ



స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నకరికల్లు మండలం నరసింగపాడు గ్రామస్తులు

నరసరావుపేట: జగనన్నకి చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. 48 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన వారికి నరసరావుపేట పట్టణానికి చెందిన శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ వేలమూరి రామకృష్ణారెడ్డి ఉచిత అన్నదానం ఏర్పాటు చేయగా, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు, ఆర్గనైజర్ బచ్చు వెంకట సత్యనారాయణ స్వయంగా భోజనాలు వడ్డించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీఎస్పీలు పల్లపురాజు, బి.ఆదినారాయణ, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర పాల్గొన్నారు.



స్పందనలో బాధితుల గోడు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

చేపల యాప్ పేరుతో మోసం

యాప్ ద్వారా చేప పిల్లలపై పెట్టుబడి పెడితే అవి పెరిగే కొద్దీ మీకు లాభం వస్తుందంటూ పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ ఉద్యోగి మమ్మల్ని నమ్మించి 15 మంది వద్ద రూ.11లక్షలు కట్టించాడు. యాప్‌ను ఎత్తేశాడు. కనిపించకుండా తిరుగుతున్నాడు. మోసం చేసినందున అతడిపై చర్యలు తీసుకోండి.

– పూనూరి కృష్ణకుమారి, నరసరావుపేట

ఇంటిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇల్లు బాగు చేసుకుంటున్నానని కొన్ని రోజులు మీ ఇంటిలో ఉంటానని చెప్పి అద్దెకు ఇంట్లో చేరాడు. తర్వాత ఇంటి కరెంటు మీటర్, ఇంటి పన్ను బిల్లులను తన పేరుపై మార్పించుకుని ఇల్లు ఖాళీ చేయకుండా నన్ను ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని బెదిరిస్తున్నాడు. అతడి నుంచి ఇంటిని విడిపించి నాకు న్యాయం చేయండి.

– ఓ మహిళ, తిమ్మాపురం, యడ్లపాడు

పప్పు మిల్లుల నిర్వాహకులు స్టాకు వివరాలు ఇవ్వాలి

జేసీ శ్యాంప్రసాద్



నరసరావుపేట: జిల్లాలోని కందిపప్పు మిల్లుల యజమానులు తమ వద్ద ఉన్న స్టాకు వివరాలను వెంటనే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం దాల్ మిల్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి కందిపప్పు సేకరణపై చర్చించారు. జేసీ మాట్లాడుతూ లేనిపక్షంలో అక్రమ నిల్వలుగా భావించి మిల్లుల యజమానులపై 6ఏ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు వంద శాతం సబ్సిడీపై కంది విత్తనాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ విషయం రైతులకు తెలియజేసి ఈ ఏడాది జిల్లాలో కంది పంట విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. అలాగే వచ్చే ఏడాది జిల్లాలో 35వేల టన్నుల దిగుబడి వచ్చేలా చూడాలని, వాటిని సేకరించి ప్యాకింగ్ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వివరించారు. దాల్ మిల్లర్లు డెలివరీ వెంటనే జరిగేలా చూసి అందుకు సంబంధించిన దయ్యర్‌లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల అధికారులు, డెప్యూటీ తహసీల్దార్లు మిల్లులపై నిత్యం నిఘా ఉంచుతారని, ఏదైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, మేనేజర్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

చిన్నారులంతా బడుల్లోనే ఉండాలి

గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని 5 నుంచి 15 ఏళ్ల వయస్సున్న పిల్లలు పాఠశాల్లో విద్యనభ్యసించే విధంగా డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, విద్యాశాఖాధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంత మంది డ్రాపవుట్స్ ఉన్నారో ఈ గురువారం లోపు నిర్ధారించి, వారిని శనివారం లోపు పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పఠశాలలను ఆధునీకరిస్తుందన్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళితే చక్కని విద్యతోపాటు బలవర్ధకమైన ఆహారం కూడా అందుతాయని చెప్పారు. నిరక్ష్యరాస్యులైన తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను సిబ్బంది తెలియజెప్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేకున్నారన్న సత్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. జగనన్న విద్యా కిట్లు నూరు శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా 8వ సబ్ జూనియర్, జూనియర్ బాల,బాలికల స్విమ్మింగ్ జట్లను ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా స్విమ్మర్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 8,9 తేదీలలో నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జిల్లా నుంచి 42 మంది స్విమ్మర్లు ఎంపిక పోటీలో పాల్గొనగా 20 మంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారిలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో ఎం.తేజేష్‌సాయి, ఎం.ఎస్.వి.రామసాయినీలేష్, జి.ఎల్.శ్రీపద్మనాభరెడ్డి, బి.అర్నవ్‌రెడ్డి, సిహెచ్.సాకేత్‌రామ్, టి.కుషాల్, కె.షణ్ముఖ సత్యవీర రుత్విక్, ఓ.దేవహర్ష, ఎస్.మహదేవ్‌రెడ్డి, బి.సత్యవర్ధన్, బి.మోహనమురళీకృష్ణ, ఓ.సుశాంత్, బాలికల విభాగంలో టి.హర్షిణి, ఆర్.లక్ష్మీలాస్యప్రియ, జూనియర్ బాలుర విభాగంలో బి.హరిష్‌కుమార్, జె.జోషిత్‌సాయి, ఎల్.ఇషాన్‌గౌతమ్, బాలికల విభాగంలో బి.అవని, పి.పి.విస్సీ, వై.భక్తివైష్ణవి ఉన్నారని తెలిపారు.

వైభవంగా ఆదిజాంబవ మహర్షి గురుపూజోత్సవం

పాత గుంటూరు: అరండల్‌పేటలోని మోహన రంగ నాయక స్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆది జాంబవ మాదిగ మహర్షి గురు పూజోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు పాల్గొన్నారు. మహామునికి పూజలు, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి అంబటికి జ్ఞాపిక ఇచ్చి సన్మానిస్తున్న దృశ్యం

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

ప్రేమ విఫలమై యువకుడు..



విద్యార్థిని వసుంధర

తెనాలిరూరల్: ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పాండురంగపేటకు చెందిన ఉదయ్‌బాబు (19) ఓ యువతిని ప్రేమించాడు. యువతికి ఆమె తలిదండ్రులు వేరే వివాహం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్‌సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

మందలించారని యువతి..

పట్నంబజారు: శ్రద్ధగా చదవాలని తల్లిదండ్రులు మందలించినందుకు ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బావాజీనగర్‌కు చెందిన మానిక వసుంధర (19) సంగడిగుంటలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తోంది. తల్లితండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో వసుంధర సరిగా చదవకపోవటం, సెల్‌ఫోన్‌లు అధికంగా చూస్తుండంటో సరిగా చదువుకోవాలని తల్లితండ్రులు మందలించారు. దీనితో మనస్తాపానికి గురైన విద్యార్థిని సోమవారం నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వసుంధర తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

అచ్చంపేట: మండలంలోని గింజుపల్లివద్ద ఆదివారం సాయంత్రం గల్లంతైన వ్యక్తి జాడ సోమవారం సాయంత్రం 6గంటల వరకు తెలియలేదు. మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మతల్లి సందర్శనకు వెళ్లిన తాడికొండ గ్రామానికి చెందిన తాడిబోయిన ప్రభాకరరావు గింజుపల్లి వద్ద కృష్ణానదిలో గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో చేపల పడవలు, మర పడవలలో నదిలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. వ్యక్తి తప్పిన పోయిన స్థలానికి పరిసరాలలో వెతికారు. అయినా కనిపించలేదు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. బుధవారం కూడా గాలింపు చర్యలు కొనసాగిస్తామని అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ తెలిపారు.

వేధిస్తున్న భర్తకు కౌన్సెలింగ్

ఫోన్ చేసిన నిముషాల వ్యవధిలో చేరిపోయిన పోలీసులు

పట్నంబజారు: కవల ఆడపిల్లలు జన్మించారని భార్య, అత్తామామలతో ఘర్షణకు దిగిన వ్యక్తిపై దిశ ఎస్‌వోఎస్‌కు ఫోన్ కాల్ చేసిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎంవీ సుబ్బారావు కథనం ప్రకారం.. ఆనందపేటకు చెందిన నాగూర్‌ఖాన్, బేగంకు గత ఏడాది వివాహం జరిగింది. వీరికి ఇటీవలి కాలంలో ఇద్దరు కవల ఆడపిల్లలు జన్మించారు. ఆడ పిల్లల జన్మించారని ఆదివారం రాత్రి సమయంలో నాగూర్‌ఖాన్ ఆడపిల్లలు అయితే ఇంటికి భారమని భావించి, అధికకట్నం ఇవ్వాలని అత్తమామలపై ఘర్షణకు దిగాడు. దీంతో బాదితులు దిశ ఎస్‌వోఎస్ ఫోన్ చేసిన నిముషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకుని, ఘర్షణకు దిగిన నాగూర్‌ఖాన్‌ను స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని భార్య బేగంకు సూచించినట్లు ఎస్‌హెచ్‌వో సుబ్బారావు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటి, గుంటూరు

ఆర్.సి.నెం. 742/2023 **టెండరు నోటీసు** తేది: 03-07-2023

వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు వారి మార్కెట్ యార్డు, గుంటూరు నందు ... కార్యాలయము నందు ఒక సంవత్సర కాలమునకు ... టెండర్లు పిలవబడుచున్నవి.

టెండరు షెడ్యూలు ఇచ్చుతేది: ది.04-07-2023 నుండి ది.10-07-2023 సాయంత్రము గం॥ 5.00 వరకు

టెండరు దాఖలు తేది : 12-07-2023 ఉదయము గం॥ 10.30 నుండి మధ్యాహ్నము గం॥ 1.00 వరకు

టెండరు తెరచు తేది: ది. 12-07-2023 మధ్యాహ్నము గం॥ 4.00లకు

ఇతర వివరములకు మరియు టెండరు షెడ్యూళ్లకు కార్యాలయపు పనివేళలలో సంప్రదించవలెను.

సం/ పర్సన్ ఇన్ ఛార్జి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు. సం/ ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుంటూరు.

పొన్నూరు పురపాలక సంఘము

ఆర్.సి.నెం. 528/2023/ఇ1 తేది: 03-07-2023

ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు–2వ పిలుపు

పొన్నూరు పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రెండవ పిలుపునకు (6 పనులు) మరియు సాధారణ నిధుల నుండి (1పనులు) ఆహ్వానించబడుచున్నది. 1.బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది. 03.07.2023, సమయము సా॥4.00ని॥ ల నుండి, 2.బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్‌నకు చివరి సమయము తేది.10.07.2023, సా॥4.00ని॥ ల వరకు మరియు 3.టెండర్లు ఓపెనింగ్ తేది.10-07-2023, సా॥ 4.30ని॥ లకు.

మిగతా వివరములకు www.tender.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

సం/- కమీషనరు, పొన్నూరు పురపాలక సంఘం.

గుంటూరు నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.710577/2023/A2 II తేది. 03 07 2023

టెండరు కం బహిరంగ వేలము నోటీసు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్లు, మొ॥ వాటికి ది.20.07.2023 నుండి 31-03-2024 వరకు లీజు నిర్వర్తించు కొనుటకు టెండరు కం బహిరంగ వేలం ది.12.07.2023 న బుధవారము ఉదయం గం॥ 11.00 ల నుండి 11.30 ల వరకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరము కాంపౌండ్ నందు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు గం. 11.30 ల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలం పూర్తయిన తదుపరి కమీషనరు గారిచే గాని వారిచే నియమించబడిన అధికారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును.

సి. నెం	ఐటం. నెం.	అయిటములు	ధరావత్తు మొత్తము (రూ.)	సాల్వెన్సీ / సెక్యూరిటీ డిపాజిట్టు (రూ.)	లీజు కాలము
1	1	ఆర్.టి.సి.బస్టాండ్ ఎదురుగా గల డా॥ కొల్లి శారదా హోల్ సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకునే హక్కు	5,00,000/-	10,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
2	2	పి.వి.కె. నాయుడు మార్కెట్టు లోపల గల కూరగాయలు మరియు వెలుపల గల ఆకుకూరల వారి నుండి రుసుము వసూలు చేసుకునే హక్కు.	2,00,000/-	4,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
3	5	వెస్ లాక్ మార్కెట్ సెల్లార్ నందు సైకిల్ స్టాండు నిర్వహించి రుసుము వసూలు చేసుకునే హక్కు. (ప్రస్తుతము వినియోగించుచున్నది)	2,00,000/-	4,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
4	6	పాల ఆసుపత్రి వద్ద గల కూరగాయల మార్కెట్ నందు రుసుము వసూలు చేసుకునే హక్కు.	50,000/-	1,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
5	7	పచ్చగడ్డి మార్కెట్టు (అరండల్ పేట 1వ లైను) నందు రుసుము వసూలు చేసుకునే హక్కు.	10,000/-	20,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
6	11	నాజ్ సెంటర్ వద్ద గల మరుగుదొడ్లు నిర్వహించి రుసుము వసూలు చేసుకునే హక్కు.	10,000/-	20,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
7	16	పి.వి.కె. నాయుడు కూరగాయల మార్కెట్ ఉత్తరము మరియు దక్షిణము వైపు గల ఫెన్సింగ్ నందు గల సైకిల్ స్టాండు నిర్వహించి రుసుము వసూలు చేసుకునే హక్కు.	1,00,000/-	2,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
8	19	నమ్మా టాయిలెట్స్: 6 ప్రదేశములలో రుసుము వసూలు చేసుకునే హక్కు. (ఉన్నది ఉన్నట్లుగా)	30,000/-	60,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు
9	26	సంబ్రిస్ మార్కెట్ చెత్త అస్కారము లేకుండా మరియు అస్కారము కలిగించు దిగుమతి చేయు ఫలములకు రుసుము వసూలు చేసుకునే హక్కు	50,000/-	1,00,000/-	20-07-2023 నుండి 31-03-2024 వరకు

గమనిక:- 1. లీజుదారుడు / గుత్తదారుడు వేలం మొత్తంపై అమలులో ఉన్న జి.యస్.టి. 18% ట్యాక్సును తప్పని సరిగా చెల్లించవలెను. 2. హెచ్చు పాట దారుడు / ఖరారు చేయబడిన పాట దారుడు తన యొక్క గాని, కంపెనీ లేఖ ఫారము యొక్క గాని, ఆర్థికపరిస్థితి తెలియజేయు పాట పాడిన మొత్తములో 25 శాతము బ్యాంకు గ్యారంటి ఏదేని షెడ్యూల్డ బ్యాంకు నుండి పొంది సకాలంలో ఆఫీసునకు సమర్పించవలెను. 3. Extra Ordinary Gazette అసాధారణ రాజ పత్రము నెం.05 ది.13-02-2023 నందలి నియమనిబంధనల మేరకు ఆక్షన్ జరుగును. 4. గెజిట్ నిబంధనల మేరకు ఐటెం నెం.11కు సఫై కర్మచారి సొసైటీలు, (రెల్లి కులస్తులు) మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు ఏదేని కారణముచే వారు వేలములు పాల్గొనని యెడల ఇతరులకు టెండరు కం బహిరంగ వేలము ద్వారా కేటాయించబడును.

లీజుకు సంబంధించిన షెడ్యూలు ఖరీదు రూ.100/- ది.11-07-2023 సాయంత్రం గం. 5-00 లోపు నగరపాలక సంస్థ యొక్క ట్రెజరీ నందు విధిగా చెల్లించి అటుల చెల్లించిన రశీదుతో సాయంత్రము గం. 5.30 లోపు ఎ-2-II సీటు నందు షెడ్యూలు తీసుకొనవలెను. టెండరు ధరావత్తు సొమ్ము ఏదైనా జాతీయ బ్యాంకు నందు కమీషనరు, నగరపాలకసంస్థ, గుంటూరు వారి పేరున తప్పనిసరిగా ఒరిజినల్ డిమాండు డ్రాఫ్టు తీసుకొని టెండరు షెడ్యూలునకు జతపరచి దాఖలు చేయవలెను. ఎట్టి పరిస్థితులలో చెక్కులు స్వీకరించబడవు. సాల్వెన్సీ మరియు ఇ.సి.టెండరుకు ఒరిజినల్ తో పాటు రిజిస్టర్ దస్తావేజు కాపీ, నోటరీ అఫిడవిట్ (under taking)తో సహా 3రోజుల ముందు దాఖలు చేయవలెను. వేలమునకు సంబంధించి పాటలో పాల్గొనుటకు గాను MROగారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్/ప్రాపర్టీ వాల్యుయేషన్ సర్టిఫికేట్ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాత్రమే ఉండవలెను. బహిరంగ వేలములో కూడా ఒరిజినల్ డిమాండు డ్రాఫ్టు, ఒరిజినల్ సాల్వెన్సీ మరియు ఒరిజినల్ ఇ.సి. జతపరచవలెను. గజిట్ నోటిఫికేషన్ కాపీ మునిసిపల్ కార్యాలయము నందు రూ.250/-లు చెల్లించి పొందవలెను. సదరు లీజులకు దాఖలు చేయబడిన టెండర్లులో హెచ్చు టెండరుగాని లేక బహిరంగ వేలములో హెచ్చు పాటను ఏది ఎక్కువైతే ఆమొత్తము ఆమోదించబడును. సదరు టెండరు గాని లేదా వేలమును గాని అంగీకరించుటకు మరియు తిరస్కరించుటకు కమీషనరుగారికి అధికారము కలదు. సదరు లీజులు యొక్క టెండరు కం బహిరంగ వేలముపై పునరాలోచనకు గానీ, వాయిదా వేయుటకు గాని నగరపాలకసంస్థ కమీషనరు గారికి పూర్తి అధికారములు కలవు.

ఇతర వివరముల కొరకు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు కార్యాలయపు పనివేళల యందు ఎ-2 గుమస్తా గారిని సంప్రదించవలెను.

సం/- కమీషనరు
గుంటూరు నగరపాలకసంస్థ